క్లుప్తంగా

నేడు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని దేవకీ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గృహలక్ష్మి పథక ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పంపిణీ చేయనున్నారని జెడ్పీటీసీ వెంకటేశ్ తెలిపారు. గృహలక్ష్మి పథకం 1,300 మందికి మంజూరైనట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రొసీడింగ్ పత్రాలు తీసుకుపోవాలని కోరారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



క్రీడాసామగ్రిని అందజేస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: యువత చదువుతో పాటు, క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించి, లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ ఆకాంక్షించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయా గ్రామాల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు ఎంపీపీ క్రీడా కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పాండునాయక్, హరిచంద్‌నాయక్, ఉప సర్పంచ్ రమణ, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ మధుసూధనాచారి, కార్యదర్శులు శ్రీహరి, హరీశ్ , రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్‌ను కలిసిన పాడి రైతులు



భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాడి రైతులు

కడ్తాల్: పాడి రైతులకు లీటరు పాలకు రూ. 4 ప్రోత్సాహకాన్ని చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ భరత్‌కుమార్‌ను పాడి రైతుల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతుల సంఘం నాయకులు రామకృష్ణ, మహేశ్, వెంకట్‌రాములుగౌడ్, వెంకటేశ్, నరేశ్, పెంటయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఆశ వర్కర్ల అరెస్ట్



రాస్తారోకో చేస్తున్న ఆశ వర్కర్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో నిరసన చేపడుతున్న ఆశ వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో వీరిని ముందస్తుగా అరెస్టు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కేటీఆర్ పర్యటన ముగిసిన తర్వాత ఆశలను విడిచిపెట్టారు. ఆశ కార్యకర్తలను అరెస్టును సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లేశ్ ఖండించారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు.

బొడ్రాయి పండుగ ఉత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని కానుగుబావితండాలో ఆంజనేయచార్యుల ఆధ్వర్యంలో గురువారం బొడ్రాయిపండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు, గ్రామస్తులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నట్లు తండా పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అవంతి ఫార్మసీ కళాశాలలో ఓరియంటేషన్

అబ్దుల్లాపూర్‌మెట్: అవంతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ పీవీ అప్పాజీ, బ్రహ్మకుమారీ సిస్టర్ కవిత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ‘రచ్చబండ’

- 130 ఎకరాల పట్టా భూమి ధరణి రికార్డుల్లో తప్పుగా నమోదు
- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎదుట వాపోయిన రైతులు
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఫోన్
- యాచారం తహసీల్దార్ హామీ



రెవెన్యూ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భూ సమస్యలపై యాచారం గ్రామంలో గురువారం ఉదయం రచ్చబండ నిర్వహించారు. యాచారం గ్రామానికి చెందిన రైతులు రెడ్డి వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి తదితరులకు సర్వే నంబర్ 190, 111, 192లో 130 ఎకరాల పట్టా భూమి ఉంది. అయితే ధరణి రికార్డుల్లో సీలింగ్, భూదాన్ భూమిగా నమోదైంది. తప్పుగా నమోదైన రికార్డులను సరి చేసి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగారు. అయినా భూ సమస్య పరిష్కారం కాలేదు. రెండు రోజుల క్రితం యాచారం మండల పర్యటనకు వచ్చిన కిషన్‌రెడ్డికి భూ సమస్య పరిష్కారం కాలేదని బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే గురువారం ఉదయం 7–30 గంటలకు రైతు వెంకట్‌రెడ్డి ఇంటికి వచ్చారు. రైతులను పిలిపించుకొని భూ రికార్డులను పరిశీలించారు. 130 ఎకరాలు భూమి సీలింగ్, భూదాన్ భూమిగా నమోదైనట్లు తెలుసుకున్నారు. రికార్డుల్లో తప్పుగా నమోదు కావడంతో రైతుబంధు, రైతు బీమా, బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వడం లేదని రైతులు వాపోయారు.

అధికారులకు ఫోన్లు

ధరణి పోర్టల్‌లో తప్పుగా నమోదైన భూ రికార్డులను వెంటనే సరి చేయాలని రెవెన్యూ ఉన్నతాధికారులు, తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఫోన్‌లో సూచించారు. స్పందించిన యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి.. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రికార్డులు సరి చేసేలా చూస్తానని ఎమ్మెల్యేకు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్‌తో పాటు ప్రధాన కార్యదర్శి పాశ్చ భాషా ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 9కోట్ల 46 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, కమిషనర్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు ఎప్పుడు?



డీఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి

ఆమనగల్లు: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఎస్‌జీటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన బాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులలో హైకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు చేపట్టడం వలన సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంజయ్య, జిల్లా కార్యదర్శి పాండు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు డీఏలను ప్రకటించాలి

మంచాల: ఉద్యోగులకు రావాల్సిన మూడు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం మంచాలలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా ఉంటామని, తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పుకుంటూనే ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేస్తున్నారని విమర్శించారు. 20 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

ఆమనగల్లు: వానాకాలం పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలంలోని మంగళపల్లి, చింతలపల్లి, సంకటోనిపల్లి, మేడిగడ్డతండా, శంకరకొండతండాలలో గురువారం రైతులు సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలను జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలలో రైతులతో మాట్లాడారు. పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి ఆమె వివరించారు. వరి పంటలో బ్యాక్టీరియా, ఎండుతెగులు నివారణకు హెక్సా ఖకోనజో 2.5 మి.లీలు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వరిలో యూరియా వాడకాన్ని తగ్గించాలని ఆమె సూచించారు. అధిక నత్రజని వాడటం వల్ల అగ్గితెగులు, మెడవిరుపు తెగులు వస్తుందని అందువల్ల రైతులు నత్రజని వాడకాన్ని తగ్గించాలని గీతారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓ శివతేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న గీతారెడ్డి

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కార్మికులు భిక్షాటన చేపట్టారు. సమ్మెకు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము మద్దతు తెలిపి.. ఆర్థికసాయం అందజేశారు. కార్మికులు శంకరమ్మ, ఈశ్వరమ్మ, సుగుణమ్మ, ఆశమ్మ, రాములమ్మ, అలివేలు, గిరిజ, పెంటమ్మ, అనంత, శాంతమ్మ, ఎల్లమ్మ, లలిత, యాదమ్మ, ఖాజాబీ, బీబీ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో నిరసన

మంచాల: మంచాల మండల కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్న రీతిలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు సరిత, ఆలివేలు, సంతోష, పద్మ, భారతమ్మ, రంగమ్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు ఆర్థికసాయం అందజేస్తున్న రాము

పోలీస్ అభ్యర్థులకు సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు, మాడ్గుల మండలాలలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో కానిస్టేబుల్‌గా ఎంపికైన నవీన్, మధుకర్‌రెడ్డి, రషీద్‌బాబ, జూనియర్ లైన్‌మెన్‌గా ఎంపికై న నరేశ్‌లను యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో సత్కరించారు. విఠాయిపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌ను ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా ఆధ్వర్యంలో సత్కరించారు. చంద్రాయణపల్లి తండాలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన కల్యాణ్, నరేశ్‌రాథోడ్, వినోద్, వినీశ్, నరేశ్, పాండులను కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌నాయక్, సిద్ధు, మురళి, రవి ఆధ్వర్యంలో సత్కరించారు. ఆమనగల్లులోని స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారిలో 10 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికైనట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నల్గొండ జిల్లా విజిలెన్స్ సీఐ చరమందరాజు, ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఆమనగల్లుకు చెందిన ఆమని, మల్లిక, డయానా, సతీశ్, శివ, మహేశ్, రవీందర్, శివ, జంగారెడ్డిపల్లికి చెందిన మహేశ్, మల్లేశ్ ఎంపికైనట్లు వారు వివరించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ వెలువరించిన ఫలితాల్లో, మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన అమంచ శ్రీలత, రావిచేడ్ మహేశ్, అర్కోటం శివకుమార్, యాట శివకుమార్, ఎర్రదేవేందర్, ఎర్ర నవీన్‌లు పోలీస్ ఉద్యోగాలు సాధించారు. గురువారం గ్రామంలోని పంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో యువత మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, ఇరిగేషన్ అధికారి శేఖర్‌బాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, చంద్రయ్య, బాలకృష్ణ, శివ, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇర్విన్‌లో యువకులను సత్కరిస్తున్న శంకర్

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: చుక్కాపూర్‌కు చెందిన వంగూరి పర్వతాలు, కాలూరి వీరేశంలు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ప్రజాప్రతినిధులు వారిని అభినందించారు. శాలువాకప్పి సన్మానించారు. సర్పంచ్ కిష్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, కార్యదర్శి చంద్రశేఖర్, పాతకోటతండా సర్పంచ్ అలివేలు, జీరానాయక్, రామచంద్రయ్య, మల్లేశ్, పాల్గొన్నారు.

ఒకే గ్రామంలో 14 మంది ఎంపిక

యాచారం: తెలంగాణ ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో యాచారం మండలం గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన 14 మంది కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అందులో ఇద్దరు సివిల్, పది మంది ఏఆర్, ఇద్దరు టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నక్కర్తమేడిపల్లిలో నలుగురు, అయ్యావారిగూడెం నుంచి నలుగురు, మిగితా గ్రామాల్లో మరో నలుగురు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

షాబాద్‌లో..

షాబాద్: కానిస్టేబుల్ ఫలితాల్లో షాబాద్ మండలానికి చెందిన యువకులు సత్తా చాటారు. తాళ్లపల్లి గ్రామానికి చెందిన రామలింగం, ప్రశాంత్, నాంధార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్, షాబాద్‌కు చెందిన సాయి భరత్, మహేశ్వరి కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

లడ్డూ.. అధరహో

- ఇబ్రహీంపట్నంలో రికార్డు
- అట్టహాసంగా వినాయక ఉరేగింపు, నిమజ్జనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చరిత్రలో గణపతి లడ్డూ రికార్డు స్థాయిలో ధర పలికింది. శ్రీరాంనగర్ కాలనీ, డాక్టర్ రాంరెడ్డి వీధిలో జూనియర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి 16 రోజులు పూజలు చేసి.. బుధవారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో లడ్డూను రూ. 10.50 లక్షలకు రాజ్‌కుమార్ బ్రదర్స్ కైవసం చేసుకున్నారు. చిన్న లడ్డూను రూ. 3 లక్షలకు మహేశ్ దక్కించుకున్నారు.

అట్టహాసంగా ఉరేగింపు

ఇబ్రహీంపట్నంలో వినాయక నిమజ్జనోత్సవ ఉరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



లడ్డూతో రాజ్‌కుమార్, మహేశ్

కార్యకర్తలదే తుది నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తన అనుచరుల అభిప్రాయం మేరకు భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని ఆ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో గురువారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కోసం నిరంతరం పనిచేస్తానని ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి రాఘవేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్‌ను ఆయనకు ఇస్తే విజయం సాధిస్తారని అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగులతో చెలగాటం

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ -1 పరీక్ష రద్దుతో నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఆమనగల్లు పట్టణంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో నిందితులను అరెస్టు చేయాలని చైర్మన్ కార్యదర్శులను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సురేశ్, సాయి, తరుణ్, మల్లేశ్, సుమన్, శివ, సాయి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అధికారం ఖాయం

కడ్తాల్: రానున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో గురువారం మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండా గ్రామ పంచాయతీలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి, కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అసమర్థ పాలన సాగిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుక్కుగూడ విజయభేరి సభలో సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీ స్కీంలను కాంగ్రెస్ అమలు చేస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ప్రతినెల రూ.2,500తో పాటు, రూ.500కే సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. రైతు భరోసా క్రింద, రైతుకు, రైతు కూలీలకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, వరిపంటకు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. గృహజ్యోతి క్రింద 200 యూనిట్ల వరకు గృహావసరాలకు ఉచిత విద్యుత్, ఇల్లులేని వారికి ఇంటి స్థలం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం అందిచనున్నామన్నారు.

దివ్యాంగులకు అండగా..

సర్పంచ్ పడకంటి కవిత

యాచారం: దివ్యాంగులకు అండగా ఉంటానని మాల్ సర్పంచ్ కవిత పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ బస్ పాసులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు.

కేటీఆర్‌కు పెయింటింగ్ బహూకరణ



కేటీఆర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

ఆమనగల్లు: మంత్రి కేటీఆర్‌కు ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి గీసిన పెయింటింగ్‌ను కేటీఆర్‌కు బహూకరించారు. షాద్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో మంత్రిని కలిసిన ఆయన తాను గీసిన చిత్రపటాన్ని అందజేశారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత

ఆమనగల్లు: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో గురువారం మహిళలకు బతుకమ్మ చీరలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటికి రూ.3 లక్షలు అందజేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రాధమ్మ

మత్స్యశాఖ సొసైటీలతో మేలు

యాచారం: జిల్లాలో ఉన్న చెరువులు, కుంటల్లో చేపల పెంపకం చేపట్టే ముదిరాజులు మత్స్యశాఖ సొసైటీలుగా ఏర్పాటు కావాలని ఆ శాఖ జిల్లా అధికారి సుకీర్తి పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామం సొసైటీ ప్రొసీడింగ్ పత్రాలను గురువారం జిల్లా కార్యాలయంలో ముదిరాజు సంఘం నేతలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీలుగా ఏర్పాటు అయితే చేప పిల్లలు, యంత్రాలు రాయితీపై అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు బాలకృష్ణ, బాల్‌రాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న సుకీర్తి